క్లుప్తంగా

జాతీయ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ జట్టుకు విద్యార్థిని ఎంపిక



వినుకొండ(నూజెండ్ల): అండర్ –17 స్కూల్ గేమ్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ స్థాయి జట్టుకు విద్యార్థిని ఎంపికైనట్లు నిర్మల ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ హెచ్‌ఎం సిస్టర్ రాణి తెలిపారు. ఇటీవల చిత్తూరు జిల్లాలో నిర్వహించిన పోటీల్లో సత్తా చాటినట్లు చెప్పారు. ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాఠశాలకు చెందిన లక్ష్మీభవాని, శశిసాయి దీపిక, హవిలా, వైష్ణవి ప్రతిభ కనపరిచి రెండో స్థానంలో నిలిచారన్నారు. వీరిలో లక్ష్మీ భవాని అనే విద్యార్థిని అత్యుత్తమ ప్రతిభ చూపి జాతీయసాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాలలో నలువురు విద్యార్థినీలను పాఠశాల నిర్వాహకులు అభినందించారు. కార్యక్రమంలో సిస్టర్ చిన్ని, కరస్పాండెంట్ సిస్టర్ డెన్నిస్, సుపీరియర్ కాస్పర్, కోచ్‌లు జోనా నాయక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇంజినీర్ బాలకృష్ణ సేవలు అభినందనీయం



శావల్యాపురం: అంకిత భావంతో విధులు నిర్వహించిన ఉద్యోగులు సమాజంలో మంచి గుర్తింపుతో పాటు ప్రజల మన్ననలు పొందుతారని ఎంపీడీఓ పి.సీతారామయ్య అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉత్తమ సేవలకు అవార్డు అందుకున్న కారుమంచి గ్రామ సచివాలయం ఇంజినీరింగ్ అధికారి ఇ.బాలకృష్ణ దంపతులకు సన్మానించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గణతంత్ర వేడుకలు సందర్భంగా జిల్లా కలెక్టరు చేతుల మీదగా ప్రశంస పత్రాన్ని బాలకృష్ణ అందుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని, తహసీల్దారు షేక్ జాన్‌సైదులు, ఎంఈఓ మద్దికుంట సాంబశివరావు, ఈఓపీఆర్డీ పి.సుగుణ పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో పాల సేకరణ ఎక్కువగా జరగాలి



సత్తెనపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో పాల సేకరణ ఎక్కువగా జరగాలని జిల్లా కో–ఆపరేటివ్ ఆడిట్ అధికారి డి.శ్రీనివాసరావు చెప్పారు. పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సత్తెనపల్లి డివిజన్ పరిధిలోని 9 మండలాల పంచాయతీ సెక్రెటరీలు, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, మిల్క్ సెక్రటరీల కు జగనన్న పాల వెల్లువ మూడవ దశపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జగనన్న పాలవెల్లువ అనేది గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయంతో.. పాటు గేదెల పెంపకం చేపట్టే వారికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మూడో విడతలో 9 మండలాల్లోని 49 గ్రామాలను జగనన్న పాల వెల్లువ కింద ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సొసైటీ పర్మినెంట్ రిజిస్ట్రేషన్ ఎలా చేయాలి.. కమిషన్ విధానం తదితర వాటిపై శిక్షణ ఇచ్చారు. సమావేశంలో 75 త్యాళ్లూరు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ శ్రీదేవి, ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, డివిజన్‌లోని 49 గ్రామాల సెక్రటరీలు హాజరయ్యారు.

అర్హులందరికి సంక్షేమ పథకాలు

- రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- పట్టణంలో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: అన్ని వర్గాల వారి జీవితాల్లో వెలుగు నింపేలా విప్లవాత్మక సంస్కరణలతో సీఎం వైఎస్ జగనన్న పాలన కొనసాగిస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పట్టణంలోని 21 వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న లబ్ధి గురించి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ జనం కష్టాలు తెలిసిన ప్రభుత్వం తమదని చెప్పారు. పేదలందరికీ నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందేలా తమ ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తెచ్చిందని పేర్కొన్నారు. ఏ కుటుంబమైనా అభివృద్ధి చెందాలంటే ఆ ఇంటిలోని భావి పౌరులకు నాణ్యమైన విద్యను అందించాల్సిన అవసరం ఉందని వివరించారు. అందుకోసం ముఖ్యమంత్రి జగనన్న ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. ఇంగ్లిష్ మీడియం, జగనన్న విద్యాకానుక, విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద వంటి ఎన్నో పథకాలతో పేద విద్యార్థులకు ఎంతో మేలు చేస్తున్నారని చెప్పారు. దీనికి తోడు వైద్య రంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆరోగ్య శ్రీని దాదాపు అన్ని వ్యాధులకు వర్తింప చేస్తున్నామని వివరించారు. రూ.16వేల కోట్లతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం నుంచి మెడికల్ కళాశాలల నిర్మాణం వరకు ఎంతో పకడ్బందీగా చేపడుతున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరికీ సొంతింటి కల నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం అందరికీ ఇళ్లు, జగనన్న కాలనీలు నిర్మిస్తోందని పేర్కొన్నారు. జగనన్న కాలనీలలో పేదవారి సొంతింటి కలలు సాకారం ఆవుతాయని వివరించారు. ప్రజా సంక్షేమం కోసం ఎంతో చేస్తున్న ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, వార్డు ఇన్‌చార్జి ఆలపాటి పద్మావతి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు పోలిశెట్టి మస్తాన్‌రావు, నాయకులు ఆలపాటి వెంకట్రావు, గ్రంధి శ్రీనివాసరావు, రావికింది సాంబశివరావు, తులాబంధుల మణిదీప్, పెన్నా సాంబశివరావు, పొట్టి రత్నబాబు పాల్గొన్నారు.

పౌరాణిక నాటకాలను ఆదరించాలి

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

రొంపిచర్ల: పౌరాణిక నాటకాలను ప్రజలు ఆదరించాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గణతంత్ర వేడుకలలో భాగంగా స్థానిక బోసుబొమ్మ సెంటర్‌లో గురువారం రాత్రి సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అంతరించి పోతున్న నేటి తరంలో పౌరాణిక నాటకమైన సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శించటం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రముఖ పౌరాణిక కళాకారులు డి.వి.నరసరాజు, చీమకుర్తి నాగేశ్వరరావు వంటి వారు సత్యహరిశ్చంద్ర పాత్రలను పోషించి వన్నె తెచ్చారని గుర్తు చేశారు. వారు పోషించిన ఆ పాత్రల ద్వారా ప్రజల హృదయాల్లో స్థిర స్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. కళాకారులను అభినందించారు. అనంతరం సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శన గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు చపారపు గోపాలరెడ్డి, మండల నాయకులు మేడికొండ శ్రీనివాసరెడ్డి, పోతుమంచి రాధాకృష్ణంరాజు, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ఉత్కంఠగా ఎడ్ల బల ప్రదర్శన పోటీలు



పోటీ బరి వద్ద ఏర్పాటుచేసిన విద్యుత్ ప్రభ



శుక్రవారం సబ్‌జూనియర్స్ విభాగంలో పోటీపడుతున్న ఎడ్ల జత

నరసరావుపేట: రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి వృషభ రాజముల బండలాగుడు బల ప్రదర్శన పోటీలు ఆరో రోజు నువ్వానేనా అన్నట్లుగా సాగాయి. పోటీలలో గురువారం న్యూ కేటగిరీ విభాగంలో నిర్వహించగా, శుక్రవారం సబ్‌జూనియర్స్ విభాగంలో నిర్వహించారు. సత్తెనపల్లిరోడ్డులోని డీఎస్‌ఏ స్టేడియంలో రైతు సంబరాల్లో భాగంగా గోపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి మెమోరియల్‌పై ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. న్యూ కేటగిరీ విభాగంలో మొత్తం 20 జతలు పోటీపడగా మొదటి మూడు బహుమతులను బాపట్ల జిల్లా చుండూరు మండల వేటపాలేనికి చెందిన అత్తోట శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్లజత, ప్రకాశం జిల్లా కురిచేడు మండలం కాటంవారిపాలేనికి చెందిన కాటం పెద్దిరెడ్డి ఎడ్లజత, ప్రకాశం జిల్లా చీమకుర్తి గ్రామానికి చెందిన జంగా విజయభాస్కరరెడ్డి ఎడ్లజతలు గెల్చుకున్నాయి. సబ్ జూనియర్స్ విభాగంలో మొదటి మూడు బహుమతులను తాడేపల్లి మండలం కుంచనపల్లికి చెందిన పులగం తిషగ్నారెడ్డి, జస్వతారెడ్డి ఎడ్లజత, గుంటూరుకు చెందిన సోమిశెట్టి ఆంజనేయులు జత, కృష్ణా జిల్లా పెనమలూరుకు చెందిన భావినేని ధార్మిక రామచౌదరి ఎడ్లజతలు గెల్చుకున్నారు. ఈ విధంగా హాజరైన ఎనిమిది ఎడ్ల జతలకు అవి నిర్ణయించిన సమయంలో బండలాగిన దూరాన్ని బట్టి స్థానాలను నిర్ణయించారు. పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల మండలాలు, గ్రామాల నుంచి వేలాదిగా రైతులు, ఔత్సాహికులు తరలి రావటంతో స్టేడియం సందడిగా మారింది. దీంతో పాటు విద్యుత్ లైట్లతో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నిర్వాహక కమిటీ సభ్యులు చల్లా నారపరెడ్డి, పొలిమేర వెంకటరెడ్డి, మూరే రవీంద్ర, పానుగోటి వెంకటరావు, కనకా పుల్లారెడ్డి, లక్కు కృష్ణారెడ్డి, వంపుగుడిజాన్, గాడిపర్తి సీతయ్య పోటీలను పర్యవేక్షించారు. శ్రీనివాసరావు, సుబ్బారెడ్డి రెఫరీలుగాను, వ్యాఖ్యాతగా సూరపునేని రాధాకృష్ణ వ్యవహరించారు.

వైభవంగా భావనారుషి కలశ మహోత్సవం

నాదెండ్ల: భద్రావతీ సమేత భావనారుషి కలశ మహోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ప్రత్యేక వాహనంలో స్వామివార్లను గ్రామోత్సవం నిర్వహించారు. తెనాలికి చెందిన కళాకారులు దేవతా మూర్తుల వేషధారణలతో ఆకట్టుకున్నారు. మహిళలు కోలాట ప్రదర్శన చేశారు. అనంతరం ఆకాశంలోకి ఆకాశ దీపాన్ని వదిలారు. శుక్రవారం సమారాధన నిర్వహించారు. కార్యక్రమాలను పద్మశాలీయ బృహత్తరసేవా సంఘం ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

టైరు పేలి వ్యక్తికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హరీష్

ఈపూరు: షోడా బండికి గాలి పెట్టుకుంటూ టైరు బరస్ట్ అవడంతో యువకుడికి గాయాలైన ఘటన మండల కేంద్రమైన ఈపూరులో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఉప్పలపాటి హరీష్, గాలి మిషన్ దగ్గరకు వచ్చి మిషన్ యజమాని లేకపోవడంతో తానే గాలి పెట్టుకోవడంతో టైరు పేలింది. దీంతో హరీష్ చేతికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఈపూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సీఎం జగన్ సభను విజయవంతం చేయాలి

శావల్యాపురం: జగనన్న చేదోడు పథకాన్ని ఈనెల 30న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వినుకొండ పట్టణంలో ప్రారంభించనున్న నేపథ్యంలో ఏర్పాటు చేయనున్న సభను విజయవంతం చేయాలని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని కోరారు. స్థానిక గ్రామసచివాలయంలో మండల స్థాయి అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు కార్యకర్తలు, కార్యకర్తలు తగిన విధంగా కృషి చేయాలని కోరారు. సదస్సులో తహసీల్దారు షేక్ జాన్‌సైదులు, ఎంఈఓ మద్దికుంట సాంబశివరావు, మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు, ఈఓపీఆర్డీ పి.సుగుణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గుర్రం శేషకుమారి, శ్రీలత, సీసీలు రమాదేవి, ఖాజావలీ, బేబిరాణి పాల్గొన్నారు.

సీజీజీబీ మేనేజర్‌కు ప్రశంసా పత్రం

శావల్యాపురం: చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు స్థానిక బ్రాంచి మేనేజర్ ఇలింద్రపర్తి విశ్వనాథ్ కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రాన్ని గురువారం అందుకున్నారు. గణతంత్ర వేడుకల్లో జిల్లా కలెక్టరు నుంచి అందుకున్నారు.

నేడు జేఎన్‌టీయూఎన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నరసరావుపేట రూరల్: కాకాని సమీపంలోని జేఎన్‌టీయూ నరసరావుపేట క్యాంపస్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శనివారం శంకుస్థాపన నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిహెచ్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్, సిమెంట్ రోడ్లు, గెస్ట్‌హౌస్, ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ బ్లాక్ నిర్మాణ పనులకు శంకుస్థాపన జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఉన్నత విద్య మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రసాదరాజు పాల్గొంటారని చెప్పారు.

నేడు మండల పరిషత్ సమావేశం

నాదెండ్ల: మండల పరిషత్ సాధారణ సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షేక్ జాకీర్‌హుసేన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీపీ తలతోటి రాణి అధ్యక్షత వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

నరసరావుపేట టౌన్: ఆర్థిక సమస్యలతో గ్రామ సచివాలయ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం పట్టణంలో చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. మాచవరం మండలం గంగిరెడ్డిపాలేనికి చెందిన నడికొండ నాగేంద్రబాబు(30) రావిపాడులో సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. పెద్దచెరువు 3వ లైన్‌లోని అద్దె ఇంటిలో ఒక్కడే నివాసం ఉంటూ ప్రతిరోజు సచివాలయానికి విధుల నిమిత్తం వెళ్లి వస్తుంటాడు. శుక్రవారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న సీఐ వీరేంద్రబాబు, ఎస్‌ఐ రహంతుల్లా సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఆర్థిక సమస్యలతో సోదరుడు ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని మృతుడి అక్క ఆదిలక్ష్మి పోలీసులకు వివరించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆప్షన్-3 గ్రౌండింగ్ గృహాలను త్వరగా పూర్తిచేయండి

- రాష్ట్ర హౌసింగ్ విభాగ ప్రత్యేక సెక్రటరీ మహమ్మద్ దివాన్ మైదీన్
- జిల్లాలో జగనన్న కాలనీలను సందర్శన



లే అవుట్‌లో అధికారులతో మాట్లాడుతున్న ప్రత్యేక సెక్రటరీ మహమ్మద్ దివాన్ మైదీన్

నరసరావుపేట: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు కోరిన ఆప్షన్–3కి సంబంధించి కాంట్రాక్టర్లతో మాట్లాడి గ్రౌండింగ్ గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర హౌసింగ్ ప్రత్యేక సెక్రటరీ మహమ్మద్ దివాన్ మైదీన్ ఆదేశించారు. దీనిలో ఎటువంటి అలసత్వం వహించిన కఠిన చర్యలు కుంటామన్నారు. శుక్రవారం జిల్లాలోని చిలకలూరిపేట, నరసరావుపేట, వినుకొండ లేఔట్‌లను సందర్శించి ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, మున్సిపల్ కమిషనర్, హౌసింగ్ సిబ్బందికి ఉగాదికి గృహ ప్రవేశాలు, గ్రౌండింగ్ మెరుగు పర్చేందుకు తగిన సూచనలు చేశారు. ఆయన వెంట గృహనిర్మాణ సంస్థ పీడీ ఎస్.వేణుగోపాలరావు ఉన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ

ముప్పాళ్ళ: ముప్పాళ్ళ ఎస్సీ కాలనీలో అభినందన ఆర్ఫాన్ అండ్ నీడీ సేవా సొసైటీ ఆధ్వర్యంలో 50 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్, కథల పుస్తకాలు, విద్యా సామగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. సొసైటీ అధ్యక్షుడు కె.సురేంద్రబాబు మాట్లాడుతూ.. పేద విద్యార్థుల ఉన్నత చదువులకు తమవంతుగా తోడ్పాటు అందిస్తున్నామన్నారు. సభ్యులు మన్నం కోటేశ్వరరావు, పి.రామారావు, బక్కారాజు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ రంగ కార్మికులు పేర్లు నమోదు చేసుకోవాలి

చిలకలూరిపేట: ప్రభుత్వ పథకాలు పొందేందుకు నియోజకవర్గ పరిధిలోని భవన, ఇతర నిర్మాణ రంగాల కార్మికులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సహాయ కార్మిక అధికారి బి.కోటేశ్వరరావు తెలిపారు. ఇప్పటి వరకు 13,183 మంది భవన, ఇతర నిర్మాణ రంగాల కార్మికులు తమ పేర్లు నమోదు చేసుకున్నారని చెప్పారు. వైఎస్సార్ బీమా, కల్యాణమస్తు, షాదీ ముబారక్, ఇతర ప్రభుత్వ పథకాల కొరకు యూనియన్ బ్యాంకులో రూ.110 చలానా చెల్లించి రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్, బ్యాంకు పాస్ పుస్తకం జిరాక్స్ కాపీలు పట్టణంలోని కార్మిక శాఖా కార్యాలయంలో అందజేయాలన్నారు. వివరాలకు 9030055307 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

నేడు మండల పరిషత్ సమావేశం

నరసరావుపేట రూరల్: మండల పరిషత్ సాధారణ సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీపీ మూరబోయిన సుబ్బాయమ్మ అధ్యక్షత వహించనున్నారు.

ఎండీయూ వాహనాలకు జీపీఆర్ఎస్ ట్రాకింగ్ సిస్టమ్

బొల్లాపల్లి: ఇంటింటికి రేషన్ అందజేసే ఎండీయూ వాహనాలకు జీపీఆర్ఎస్ ట్రాకింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయనున్నట్లు సీఎస్‌డీటీ వై.లక్ష్మణరావు తెలిపారు. మండల కేంద్రంలో వాహనదారులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మండలంలో 13 ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్నామని, వీటిలో బొల్లాపల్లి, వెల్లటూరు ఎండీయూలకు జీపీఆర్ఎస్ సిస్టమ్ ఇప్పటికే ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

'భూ రక్ష' పథకంపై సర్వేయర్లకు శిక్షణ

పెదకూరపాడు: మండల పరిధిలోని గ్రామ సర్వేయర్లకు వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంపై స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. సత్తెనపల్లి ఆర్డీఓ రాజకుమారి పాల్గొని, మాట్లాడారు. రైతులకు సర్వే ఉపయోగాలు, దశల వారీగా సర్వే విధానం, రైతులకు నోటీసులు ఇవ్వడం..ఇలా అనేక అంశాలపై సర్వేయర్లు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని విషయాలను పరిగణలోకి తీసుకుని ఖచ్చితత్వంతో సర్వే చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ క్షమారాణి, జిల్లా సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయం సందర్శన



ఆలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న హిమాలయ గురువు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని కొండమెట్ల వద్ద ఉన్న లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన రథసప్తమి ఉత్సవాల్లో భాగంగా హిమాలయ గురువు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ ఆవరణలో నిర్మాణంలో ఉన్న ఆశ్రమ పనులను స్వయంగా పర్యవేక్షించి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో నిర్వాహకులు జాజుల మాల్యాద్రి, యక్కల శ్రీరామచంద్రమూర్తి, బద్దిక నరసింహారావు, రాము, వెంకటేశ్వర్లు, దోగిపర్తి స్వామి పాల్గొన్నారు.